క్లుప్తంగా

26న మరిడిమాంబ అమ్మవారి పండగ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ఈ నెల 26న మునగపాకలో మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ పెద్దలతో రాజకీయాలకు అతీతంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలో భాగంగా నిర్వహిస్తున్న మహిళల కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలన్నారు. నేల వేషాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, నాయకులు విల్లూరి నూకనరసింగరావు, ఆడారి లక్ష్మణరావు, శ్రీకాంత్, పంచాయతీ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

గణనాథుడి సన్నిధిలో హోమం



టి.సిరసపల్లిలో హోమం నిర్వహిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి, నాగప్పారావు దంపతులు

మునగపాక: వినాయక చవితి వేడుకల్లో భాగంగా టి.సిరసపల్లిలో శుక్రవారం హోమం నిర్వహించారు. వినాయక విగ్రహం వద్ద సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, నాగప్పారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గణనాథుడిని దర్శించుకుని పూజలు చేశారు.

కళావేదిక ప్రారంభం



కళావేదిక నిర్మించిన దాతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

ఎస్.రాయవరం: వమ్మవరం గ్రామానికి చెందిన లోకారెడ్డి పద్మావతి తన తండ్రి దివంగత కోవెల స్వామి జ్ఞాపకార్థం రూ.4 లక్షల నిధులతో పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో కళావేదికను నిర్మించారు. శుక్రవారం ఈ వేదికను పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరిట ఇటువంటి సేవలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాణిక్యం, విద్యా కమిటీ చైర్మన్ ఆదినారాయణ, స్థానిక నాయకులు బండి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బంగారయ్య, షెడ్రక్, ఉపాధ్యాయులు ఆర్.అప్పలనాయుడు, గారా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా పఖ్వాడ్‌పై వ్యాస రచన పోటీలు



చినదొడ్డిగల్లులో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నక్కపల్లి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా పఖ్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పర్యావరణం పరిరక్షణ, పచ్చదనం, పరిశుభ్రతపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ వ్యవస్థాపకుడు, పాఠశాల ఉపాధ్యాయుడు ఏడిద వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతపై అవగాహన ఉండాలన్నారు. అనేక రోగాలకు మూల కారణమైన అపరిశుభ్రతపై కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

‘మరుగు’న పడిన సమస్య!

- చోడవరంలో కానరాని పబ్లిక్ టాయిలెట్లు
- ఒకటికి, రెంటికి తప్పని తిప్పలు
- మహిళల అవస్థ వర్ణనాతీతం



గతంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ స్థానంలో ప్రస్తుతం నిర్మించిన అన్న క్యాంటీన్



బస్ కాంప్లెక్స్‌లో మూతపడిన టాయిలెట్లు

యలమంచిలి రూరల్: నియోజకవర్గ కేంద్రం యలమంచిలిలో మరుగు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఎక్కడా పబ్లిక్ టాయిలెట్లు కానరాకపోవడంతో ఒకటికి, రెంటికి ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 5 వేల మందికి పైగా తమ అవసరాల కోసం నిత్యం యలమంచిలి నియోజకవర్గ కేంద్రానికి వచ్చిపోతుంటారు. వీరితో పాటు చిరు వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, రైలు, బస్సు ప్రయాణికులు రోజువారీ కూలీలు కూడా ఉన్నారు. పట్టణ జనాభా 52 వేలు. ఇంత మంది అవసరాలకు యలమంచిలి పట్టణంలో ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. గతంలో మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు కొమ్మాయిగుండం చెరువుకు ఆనుకుని సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఆ తర్వాత 2014లో టీడీపీ ప్రభుత్వం ఆ పబ్లిక్ టాయిలెట్లను పడగొట్టి నిబంధనలకు విరుద్ధంగా చెరువును ఆక్రమించి అన్న క్యాంటీన్‌ను నిర్మించారు. ప్రస్తుతం మళ్లీ అక్కడ అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడానికి రూ.7 లక్షలు ఖర్చు చేసి భవనాన్ని ఆధునికీకరించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి సహా పలు ప్రధాన వీధులు, వ్యాపారాలు ఎక్కువగా జరిగే భవనం వీధి, దిమిలి రోడ్డు, కూరగాయల మార్కెట్, బజారు వీధి, కోమటిపేట, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో ఎక్కడా ప్రజా మరుగుదొడ్లు మచ్చుకైనా కనిపించవు. బస్ కాంప్లెక్స్‌లో నగదు చెల్లించే విధానంలో టాయిలెట్లు ఉన్నాయి. కాంప్లెక్స్ ఆవరణలోనే స్వచ్ఛభారత్‌లో భాగంగా గతంలో టాయిలెట్లు నిర్మించారు. నిర్వహణ లోపంతో వీటికి కొన్నాళ్ల క్రితమే తాళాలు వేసేశారు. పట్టణంలో టాయిలెట్లు లేక ప్రజలు, ముఖ్యంగా మహిళలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీకావు. పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో పలువురు బహిరంగ మల, మూత్ర విసర్జన చేయక తప్పని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని పలు ఖాళీ ప్రదేశాలు అపరిశుభ్రంగా ఉంటూ తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరోవైపు ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకుల్లో మున్సిపాలిటీ వెనకబడుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టణంలో ప్రజల అవసరాలకు సరిపడా పబ్లిక్ టాయిలెట్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా మరుగుదొడ్లు చాలా అవసరం



పేరుకే పట్టణం..యలమంచిలిలో ఒక్కటి కూడా పబ్లిక్ టాయిలెట్ నిర్మించకపోవడం దురదృష్టకరం. ప్రజా మరుగుదొడ్ల ఏర్పాటు చాలా అవసరం. లేదంటే పట్టణంలో పారిశుధ్యం లోపిస్తుంది. ఇప్పటికైనా నాయకులు మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలి.

– సీహెచ్ నవీన్, రాంనగర్, యలమంచిలి

మహిళలకు అవస్థలే



పట్టణంలో పబ్లిక్ టాయిలెట్‌లు లేవు. దీంతో వివిధ పనులపై చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే మహిళలకు అవస్థలు తప్పడం లేదు. అత్యవసరమైతే ఉగ్గపట్టుకోక తప్పని పరిస్థితి. పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలపై కూడా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు చూపించాలి.

– షేక్ బషీర్, గాంధీనగరం, యలమంచిలి

ఆత్మగౌరవానికి భంగం



మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతోంది. మహిళల కోసం తప్పనిసరిగా పబ్లిక్ టాయిలెట్‌లు నిర్మించాలి. ఇలాంటి సమస్యలు పరిష్కరించినప్పుడే ప్రజల మన్ననలు పొందుతారని నాయకులు గుర్తించాలి.

– షేక్ ఆషియా, ప్రైవేటు ఉద్యోగిని

కాంప్లెక్స్ వద్ద ఆక్రమణలు తొలగించండి

మున్సిపల్ కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

యలమంచిలి రూరల్: యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఇన్, అవుట్ గేట్ల వద్ద బస్సుల రాకపోకలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలన్నిటినీ తొలగించాలని వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు శుక్రవారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ డి.ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేశారు. రెండ్రోజుల క్రితం ఎటువంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండా, అనుమతులు పొందకుండా బస్ కాంప్లెక్స్ వద్ద ఉన్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం గట్టును కొంతమేర తొలగించడం వెనుక అధికార కూటమి నాయకుల కుట్ర ఉందని వారంతా ఈ సందర్భంగా ఆరోపించారు. కాంప్లెక్స్‌లోకి బస్సుల రాకపోకలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను వదిలిపెట్టి కేవలం రాజకీయ వైరంతోనే వైఎస్సార్ విగ్రహం గట్టును తొలగించారన్నారు. అయినప్పటికీ ప్రజా ప్రయోజనాల కోసం మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు కూడా విగ్రహానికి పడమర వైపు ఉన్న గట్టును నాలుగడుగుల మేర తొలగించడానికి అంగీకరించారన్నారు. అయితే కాంప్లెక్స్ గేట్ల వద్ద ఉన్న మిగతా ఆక్రమణలను కూడా తొలగించాలని వారంతా డిమాండ్ చేశారు. పట్టణంలో రాత్రి సమయాల్లో రైల్వేస్టేషన్ రోడ్డుపై బస్సులు నిలిపి ఉంచుతున్నారని, ఆర్టీసీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, అంతర్గత రహదారులపై రాత్రి సమయాల్లో బస్సులు నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి సంబంధించి ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్నా మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసిన తర్వాతే ముందుకు వెళ్లాలని కౌన్సిలర్లంతా కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్యగుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు దూది నర్సింహమూర్తి, రాపేటి సంతోష్, సుంకర మరిణేశ్వరరావు, పి.కనకమణి, పిట్టా సత్తిబాబు, గొర్లి వెంకట్, చిన్న శ్రీను, దుంగా అచ్యుతరావు, షేక్ సయ్యద్‌బీబీ, వైఎస్సార్‌సీపీ నేతలు దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ, అంకిరెడ్డి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఎస్.రాయవరం: ఉత్తమ సమాజానికి ఉపాధ్యాయుల ఉత్తమ బోధన ఎంతో అవసరమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు స్వీకరించిన ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట ప్రధానోపాధ్యాయుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు, పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల సుధాకర్, రేవుపోలవరం ఉన్నత పాఠశాల నుంచి భాస్కర్‌శారదా, ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కె.సంపత్, కె.వీరునాయుడు, చినగుమ్ములూరు ఉన్నత పాఠశాల పీఈటీ ప్రేమ్‌కుమార్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులు సన్మార్గంలో నడిచేటట్లు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు, ఎంఈవో బి.సత్తిబాబు, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు జి.సునీల్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ ఇ.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



సమావేశమైన రేగుపాలెం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు

యలమంచిలి రూరల్: ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ కోరారు. శుక్రవారం జరిగిన రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలో ఎలాంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయో గుర్తించాలన్నారు. ఎక్కువ మంది జ్వరం, జలుబు, దగ్గు వంటి వ్యాధులతో బాధపడుతున్నట్టు వైద్య సిబ్బంది ఎంపీపీకి తెలిపారు. ఆస్పత్రి బడ్జెట్‌పై చర్చించి అవసరమైన వైద్య పరికరాల కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వం ఆస్పత్రికి సరఫరా చేసిన పలు పరికరాలను వినియోగించుకోవాలన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా స్నేహ పూర్వకంగా మెలిగి మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. ఈ ఆస్పత్రికి అవసరమైన పరికరాలను సమకూర్చడానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పార్టీ నాయకులు రాజాన మహాలక్ష్మి, మర్రి రాజబాబు, ఎడ్ల వాసు, వైద్యులు శిరీష, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. అనకాపల్లి ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 42 మంది ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విశాఖ లెఫ్టినెంట్ కల్నల్ పల్లవి వర్మ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసిన కేడెట్లను ఆయన అభినందించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మునగపాక: మునగపాక మండల సమస్యలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్టు జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి జనపరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రాత్రి పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. రహదారులు, కాలువల అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, బొడ్డేడ అప్పలనాయుడు, కాళ్ల చంద్రమోహన్, పాలిపిని రాము, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి డివిజనల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్ పరిధిలో గోకులపాడు ఫీడర్‌కు శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో కొరుప్రోలు ఫీడర్‌కు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

గొడిచర్ల పాఠశాలలో హిందీ దివస్



గొడిచర్ల పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నక్కపల్లి: మండలంలో గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం అప్పారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హిందీ పాటలు పాడుతూ విద్యార్థులు డ్యాన్స్ చేశారు. హిందీలో కవితలు, పద్యాలు చదివి వినిపించారు.

111 హెక్టార్లలో వరి పంట నష్టం

మునగపాక: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండల వ్యాప్తంగా 111 హెక్టార్ల మేర వరి పంటకు నష్టం జరిగినట్టు గుర్తించామని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో నష్టం వివరాలు సేకరించారన్నారు. 663 మంది రైతులను బాధితులుగా గుర్తించి, వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రైతులకు సాయం అందుతుందన్నారు.

ఆవలో తూటికాడ తొలగింపు

పాయకరావుపేట: గోపాలపట్నం ఆవలో ఉన్న తూటికాడను గుంటపల్లి రైతులు శ్రమదానంతో తొలగింపు చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంటపల్లికి చెందిన పలువురు రైతుల పంట పొలాలు నీట మునిగాయి. 10 రోజులుగా వరి పొలాలు నీటిలోనే ఉండడంతో పంటకు నష్టం వాటిల్లింది. ఆవ నీటిలో పెరిగిపోయిన తూటికాడ, గరికె, కలువ పువ్వుల కాడలు కారణంగా నీరు సక్రమంగా ప్రవహించలేదని భావించిన రైతులు ఈ మేరకు తొలగింపు చర్యలు చేపట్టారు. నామవరం పీఏసీఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట కిరణ్ ఆధ్వర్యంలో రైతులు తూటికాడను తొలగిస్తున్నారు.

ఏచూరి ఆశయ సాధనకు పాటుపడాలి



గవర్ల అనకాపల్లిలో ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ కొయిలాడ



అచ్యుతాపురంలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



రాంబిల్లిలో ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగపాక: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ కోరారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో శుక్రవారం సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో ఏచూరి చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. విశాఖలోని ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజ్యసభలో తన గళం వీప్పారని గుర్తు చేశారు. సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ దాడి శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అచ్యుతాపురం(మునగపాక): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఎం నేత సీతారాం ఏచూరి జీవితం సాగిందని ఆ పార్టీ నాయకులు సదాశివరావు, రాములు అన్నారు. అచ్యుతాపురం మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏచూరి మృతి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్రి అప్పారావు, సోమునాయుడు, ఆర్.లక్ష్మి, రామకృష్ణ పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): ఇటీవల మృతి చెందిన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి చిత్ర పటానికి వద్ద రాంబిల్లి మండల కేంద్రంలో స్థానిక సీపీఎం నేతలు, నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాంబిల్లి మండల కన్వీనర్ జి.దేముడునాయుడు, పార్టీ నాయకులు ఎన్.నారాయణరావు, సిహెచ్.శివాజీ, సిహెచ్.రామాకృష్ణ, సిహెచ్.నూకన్న, వై.రాము, సిహెచ్.గంగరాజు, ఎన్.కాసియ్య పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం



అరబుపాలెం కేంద్రంలో వానపాములు విడుదల చేస్తున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు తెలిపారు. మండలంలోని అరబుపాలెం సంపద తయారీ కేంద్రంలో శుక్రవారం ఆయన వానపాములను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్మీకంపోస్టు ద్వారా ఎరువులు తయారవుతాయన్నారు. తద్వారా రైతులకు విక్రయించి ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

17న నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

నక్కపల్లి: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఈ నెల 17న నులిపురుగు నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) పంపిణీ చేయనున్నట్టు గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ సంధ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించారు. పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నామని వారు పేర్కొన్నారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఈవో లక్ష్మణమూర్తి, ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పాఠశాల విద్యార్థులు విధిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని సర్వసిద్ధి వైద్యాధికారి ఎస్.వాసంతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ పరిధిలో ఉన్న పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ నెల 17న ఈ మాత్రలు పాఠశాలలో విద్యార్థులకు వేయించాలని సూచించారు. ఆ రోజు పాఠశాలకు రాని విద్యార్థులకు 25న అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కామర్స్ హెచ్‌వోడీ రామారావుకు అభినందన



రామారావును అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రేఖా రామారావును అమృత్‌సర్ గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయం, గోపాల్ కిరణ్ సేవా సంస్థ సంయుక్తంగా సింబర్ ఆఫ్ నాలెడ్జ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్ డైమండ్ అచీవర్స్ అవార్డు–2024కు ఎంపిక చేశాయి. ఇటీవల ఈ అవార్డును రామారావుకు సంబంధిత జ్యూరీ సభ్యులు ప్రదానం చేశారు. ఈ మేరకు రామారావును శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఇతర అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి, పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



మునగపాక సర్పంచ్ అప్పారావుకు వినతిపత్రం అందజేస్తున్న జగనన్న కాలనీ వాసులు

మునగపాక: తమ కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం రాత్రి మునగపాక జగనన్న కాలనీ వాసులు సర్పంచ్ దిమ్మల అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కాలనీకి వెళ్లేందుకు వీలుగా రహదారితో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన సర్పంచ్ అప్పారావు కాలనీకి అవసరమయ్యే సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, పాలకవర్గ సభ్యులు పీలా శివ, విల్లూరి షకిరమనాయుడు, బలిరెడ్డి సూరిబాబు, ప్రసాద్, మురళి, ఆడారి అప్పలనాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డు జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డును ఆనుకుని కూరగాయల అమ్మకాలు చేపట్టడంతో పాటు ఆటోలు నిలిపివేయడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పోలీసులు స్పందించి, ట్రాఫిక్ జామ్‌పై శుక్రవారం దృష్టి సారించారు. ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలని సూచించారు.

8 గ్రామాల్లో వినియోగంలోకి సంపద కేంద్రాలు



రేగుపాలెం కేంద్రంలో వానపాములు విడుదల చేస్తున్న ఎంపీడీవో, గ్రామ పెద్దలు

యలమంచిలి రూరల్: చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను 8 గ్రామ పంచాయతీల్లో అధికారులు శుక్రవారం వినియోగంలోకి తెచ్చారు. మండలంలోని తురంగలపాలెం, జంపపాలెం, లైనుకొత్తూరు, రేగుపాలెం, లక్కవరం, పులపర్తి, కొత్తలి, రేగుపాలెం గ్రామాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన కేంద్రాల్లో చెత్తలో వానపాములను శుక్రవారం ఎంపీడీవో అప్పలనాయుడు, ఆయా పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు విడిచిపెట్టారు. ఇకపై క్రమం తప్పకుండా ఈ కేంద్రాలను పరిశీలిస్తూ సక్రమంగా పనిచేసేలా చూస్తామని ఎంపీడీవో తెలిపారు.